రాజశేఖర్‌కు ఓయూ డాక్టరేట్

కట్ల రాజశేఖర్

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 23: ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో కట్ల రాజశేఖర్ డాక్టరేట్ సాధించారు. సైఫాబాద్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్ నాయక్ పర్యవేక్షణలో 'ఇన్విస్టిగేషన్ ఆఫ్ స్ట్రక్చరల్, మాగ్నెటిక్ అండ్ ఎలక్ట్రికల్ ప్రాపర్టీస్ ఆఫ్ రేర్ ఎర్త్ డోప్‌డ్ నికెల్ – కాపర్ నానో ఫెర్రైట్స్'అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి రాజశేఖర్ సమర్పించిన పరిశోధన గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. రాజశేఖర్ హైదరాబాద్ కిట్స్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 23: రాష్ట్రంలో చాలాకాలం తరువాత నిర్వహిస్తున్న టెట్ పరీక్షా ఫీజును తగ్గించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు. అధిక ఫీజుతో నిరుపేద అభ్యర్థులపై పెనుభారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో టెట్ పరీక్షా ఫీజు ఒక పేపర్‌కు రూ.200, రెండు పేపర్లకు రూ.300 చొప్పున ఉండేదని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ఒక పేపర్‌కు రూ.1000, రెండు పేపర్లకు రూ.2000 కు పెంచడం వలన నిరుద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. తక్షణమే టెట్ పరీక్షా ఫీజును తగ్గించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

భగత్‌సింగ్ సేవలు మరువలేనివి

- ఓయూలో భగత్‌సింగ్ వర్ధంతి
- నివాళులర్పించిన విద్యార్థి నాయకులు

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 23: స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని ఉస్మానియా యూనివర్సిటీలో శనివారం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి రవినాయక్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రవినాయక్ మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు ప్రభుత్వం భారతరత్న ప్రకటించి స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర ఉద్యమంలో సంబంధం లేని వ్యక్తుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చుతున్నారని ఆరోపించారు. భగత్‌సింగ్ చరిత్రను పాఠ్యపుస్తకాల నుంచి తొలగించిన బీజేపీని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో యువకులు, ప్రజలు అందరూ కలిసి ఓడించి, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయికిరణ్, శ్రీకాంత్, శిరీష, ప్రశాంత్, కృష్ణ, పవన్‌కళ్యాణ్, మన్సూర్, అరవింద్, సందీప్, రాజ్‌కుమార్, శ్రీనాథ్, అజయ్, రామకృష్ణ, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీడీఎస్‌యూ నాయకులు నాగేశ్వరరావు, పెద్దింటి రామకృష్ణ మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ త్యాగాలు అసమానమైనవని అన్నారు. వారి త్యాగాలను నేటి ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారి విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై నెలకొల్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల కాలంలో మోదీ దేశంలో విద్వేషాలు, వైషమ్యాలు కేంద్రంగా పాలన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ, దేశంలోని రైతులు, కార్మికులపై దమనకాండ చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో భగత్‌సింగ్ స్ఫూర్తితో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సుమంత్, రుక్మత్‌పాషా, అంజి, సాయి, క్రాంతి, కోటేశ్వర్, సంతోష్, మధు, నవ్యశ్రీ, ప్రణీత, భాను, అనిల్, సాగర్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు చిరస్మరణీయులు

బన్సీలాల్‌పేట్, మార్చి 23 : దేశానికి స్వాతంత్ర్యం అందించడానికి తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు చిరస్మరణీయులని పద్మారావునగర్‌లోని హమాలీబస్తీ వాసులు అన్నారు. పద్మారావునగర్‌లోని హమాలీబస్తీలో శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా స్థానిక కమ్యూనిటీ హాలు వద్ద వారి చిత్రపటాలకు నివాళర్పించారు. బస్తీ కమిటీ అధ్యక్షుడు సుభాశ్, యాదగిరి, శ్యామ్, రవి, రాందాస్, అంజయ్య, హరి, జర్నలిస్టులు శేషగిరిరావు, కోటేశ్వర్ పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు



భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు నివాళులర్పిస్తున్న హమాలీబస్తీ వాసులు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు కిరణ్, శ్రీహరి, శర్విన్

ఉద్యమకారులం బీఆర్ఎస్ వెంటే నడుస్తాం

మారేడ్‌పల్లి, మార్చి 23: బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న లేకపోయిన ఉద్యమకారులందరూ మాజీ సీఎం కేసీఆర్ తోనే ఉన్నారని కంటోన్మెంట్ బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు తెలిపారు. శనివారం కార్ఖానాలోని విక్రంపురి కాలనీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉద్యమకారులు కిరణ్, పెంటా శ్రీహరి, శర్విన్, ధన్‌రాజు, డప్పుల శేఖర్ మాట్లాడుతూ..కంటోన్మెంట్ ప్రాంతంలో ఒక్కరూ ఇద్దరు మాత్రమే ఉద్యమకారులు కాంగ్రెస్ పార్టీలో చేరినంత మాత్రాన ఉద్యమకారులందరూ వెళ్లిపోయినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఎవరూ కూడా ఉద్యమకారులు బీఆర్ఎస్ పార్టీని వదిలి పోలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు కూడా మధ్యలో వచ్చిన ఉద్యమకారులని మధ్యలోనే పోతున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో దివంగత నేత ఎమ్మెల్యే సాయన్న, ఎమ్మెల్యే లాస్యనందిత మృతి చెందడంతో ఆ బాధ నుంచి ఇంకా తాము కోలుకోలేదని, బీఆర్ఎస్ పార్టీలో ఉద్యమకారులందరూ వెళ్లిపోతున్నారని తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఉద్యమకారులందరూ బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని రానున్న మల్కాజ్‌గిరి పార్లమెంట్, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి మాజీ సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు సానాధి శ్రీనివాస్, అత్తర్ మున్ను బాయ్, శత్రు మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

బేగంపేట్ మార్చి 23: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ప్రదర్శనలను ఎంతో ఉపయోగ పడతాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి అన్నారు. బేగంపేట్ చికోటి గార్డెన్స్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో శనివారం విద్యార్థులు వివిధ అంశాలతో కూడిన ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా కావ్యరెడ్డి పాల్గొని విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల ప్రదర్శనలను తిలకించారు. విద్యార్థులు ఇలాంటి ప్రదర్శలతో పాటు వారు ఎంచుకున్న రంగం వైపు లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. గౌతమ్ మోడల్ స్కూల్ చైర్మన్ వెంకటనారాయణ,డైరెక్టర్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ మల్లిక పాల్గొన్నారు.

ప్రదర్శనలను తిలకిస్తున్న కావ్యరెడ్డి

సీతాఫల్‌మండిలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటన

సికింద్రాబాద్,మార్చి23: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు,కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శనివారం సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా డివిజన్ పరిధిలోని బ్రాహ్మణ బస్తీలో పలు సంఘాల నాయకులతో సమావేశమయ్యారు.అంతే కాకుండా అపార్ట్ మెంట్ వాసులతో, నాయకులు,కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. పలు పోలింగ్ బూత్‌లలో ఆయన స్వయంగా పర్యటించారు. అక్కడ నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. అనంతరం బ్రాహ్మణబస్తీలోని పలు బస్తీలు, కాలనీలలో పాదయాత్ర చేపట్టారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలకు నాయకులు,కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రవిప్రసాద్‌గౌడ్,అజయ్ నాయుడు,అంబాల రాజేశ్వర్‌రావు,కనకట్ల అరవింద్ హరి, నాగేశ్వర్‌రెడ్డి,సారంగపాణి ,రాజేశ్‌నాయర్ పాల్గొన్నారు.

బ్రాహ్మణబస్తీలో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

యువత దేశభక్తిని అలవర్చుకోవాలి

నివాళులర్పిస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

కంటోన్మెంట్, మార్చి 23: దేశం కోసం మన జాతి సంక్షేమం కోసం చిరుప్రాయంలోనే తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులు సర్దార్ భగత్ సింగ్, రాజగురు, సుఖ్ దేవ్ సింగ్‌ల ఆశయాలను నేటి యువత అనుసరిస్తూ దేశభక్తిని పెంపొందించుకోవాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. శనివారం న్యూ బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్ వద్ద బోయిన్‌పల్లి స్వామి వివేకానంద సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భగత్ సింగ్, రాజ్ గురు సుఖ్ దేవ్ సింగ్‌ల 93వ వర్ధంతి కార్యక్రమంలో జంపన ప్రతాప్ పాల్గొని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతినిధులు శషిరాజ్ యాదవ్, దయానంద్ యాదవ్, మల్లేశ్ యాదవ్, ప్రకాశ్ యాదవ్, ముత్యాలు, బాలరాజ్, వర్మ, అజిత్, శామ్యూల్ పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి

మడ్‌ఫోర్డ్ బస్తీ వాసులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీ గణేశ్

కంటోన్మెంట్, మార్చి 23: నియోజకవర్గంలోని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీ గణేశ్ అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడికి సకల సౌకర్యాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు శనివారం మూడవ వార్డు మడ్‌ఫోర్డ్ అంబేద్కర్‌నగర్‌లో స్థానికులతో కలిసి శ్రీ గణేశ్ పర్యటించారు. బస్తీవాసులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీంతో పలు సమస్యలను శ్రీ గణేష్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ మాట్లాడుతూ రానున్న ఉప ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తాను గెలుపొందిన వెంటనే ఇందిరమ్మ స్ఫూర్తితో రాహుల్ గాంధీ అడుగుజాడల్లో, సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం మడ్ ఫోర్డ్ కాలనీకి చెందిన స్థానికులు పూలమాల, శాలువాలతో శ్రీ గణేశ్‌ను సన్మానించి తమ పూర్తి మద్దతు మీకే అంటూ నినాదాలు చేశారు.

మహిళలతో భేటీ ..

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీ గణేశ్ అన్నారు. ఈ క్రమంలో శనివారం పికెట్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన మహిళలతో ప్రత్యేకంగా శ్రీ గణేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మల్కాజిగిరి పార్లమెంట్, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు.

లాస్యనందితకు నివాళి

కంటోన్మెంట్, మార్చి 23: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ దివంగత ఎమ్మెల్యే లాస్యనందిత మృతిచెంది నెల రోజులైన నేపథ్యంలో శనివారం బీఆర్ఎస్ నేతలు ఆమెకు నివాళులర్పించారు. ఎమ్మెల్యే లాస్యనందిత దూరమై నెలరోజులు గడిచిన నేపథ్యంలో గులాబీశ్రేణులు ఆమె సేవలను కొనియాడారు. కార్ఖానా గృహలక్ష్మి కాలనీలోని లాస్యనందిత నివాసంలో ఆమె చిత్రపటానికి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పుష్పాంజలి ఘటించారు. ప్రజాసేవ చేస్తూ మంచి పేరు తెచ్చుకున్న లాస్యనందిత కంటోన్మెంట్ ప్రజలందరి గుండెల్లో నిలిచిపోయారని బీఆర్ఎస్ నేతలు కీర్తించారు. లాస్యనందితకు నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ నేతలు మురళీ యాదవ్, భాస్కర్ ముదిరాజ్, ఆనంద్, రాజు యాదవ్, శత్రుఘ్ను మధు, శేఖర్, హ్యాపీ టీమ్ సభ్యులు, గులాబీ శ్రేణులు ఉన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళి

అమీరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అమీర్‌పేట్‌లోని షహీద్ భగత్‌సింగ్ విగ్రహానికి శనివారం అమీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ శేషుకుమారి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– అమీర్‌పేట్, మార్చి 23

తిరుపతిరావు కమిటీ నివేదికను బహిర్గతం చేయాలి

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 23: ఉస్మానియా యూనివర్సిటీలో అక్రమంగా సీనియర్ ప్రొఫెసర్ పదోన్నతులు పొందిన వారిని వీసీలుగా నియమించకూడదని ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం సత్య మాట్లాడుతూ పదోన్నతుల్లో అవకతవకలపై నియమించిన తిరుపతిరావు కమిటీ నివేదికను బహిర్గతం చేయాలని కోరారు. దీనిపై విస్తృతస్థాయి కమిటీ ఏర్పాటు చేసి, సమగ్ర విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన బుర్రా వెంకటేశం కమిటీ ఏర్పాటు గురించి ప్రభుత్వంతో చర్చిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. నాయకులు కళ్యాణ్, సుశాంత్, ధోని పాల్గొన్నారు.

కళాసాగరం ఆధ్వర్యంలో సంగీత కచేరీ

యువ రసికలో భాగంగా కచేరీ చేస్తున్న కళాకారులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 23: యువతలో సంగీత అభిలాషను పెంపొందించేందుకు కళాసాగరం, చెన్నై మ్యూజిక్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ఓయూలోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ ఎంవీ హాల్‌లో శనివారం సంగీత కచేరీ 'యువ రసిక' నిర్వహించారు. ఈ సందర్భంగా కళాసాగరం ప్రధాన కార్యదర్శి రామమూర్తి మాట్లాడుతూ నేటితరం యువతకు శాస్త్రీయ సంగీతం అంటేనే తెలియకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వారిలో ఆసక్తిని పెంపొందించేందుకు కళాశాలల్లో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ (కోఫేమ్) సహకారంతో ఈ యువ రసిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కోఫేమ్ చైర్‌పర్సన్ డాక్టర్ వై. రమాప్రభ, కార్యదర్శి భవాని, ప్రిన్సిపల్ ఉషా జ్యోతిర్మణి పాల్గొన్నారు.

రసాయన రంగులు ప్రమాదకరం

కంటోన్మెంట్, మార్చి 23: హోళీ పండుగను పురస్కరించుకుని ప్రజలు సహజసిద్ధమైన రంగులు వాడాలని, రసాయన రంగులు చల్లుకుంటే హానికరమని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. శనివారం బోయిన్‌పల్లిలోని సాయి గ్రామర్ హై స్కూల్‌లో దిశా జైన్ ఆధ్వర్యంలో రెండువందల మంది విద్యార్థులకు రంగులు, మిఠాయిలు, రంగులు చల్లుకునే పిచికారీలను దిశా జైన్‌లతో కలిసి జంపన ప్రతాప్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అజిత్ కళ్యాణ్, రామారావులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

బన్సీలాల్‌పేట్, మార్చి 23 : అప్సా, టెక్ మహీంద్రా ఫౌండేషన్ స్మార్ట్ కేంద్రంలో ఉచిత నైపుణ్య శిక్షణ కోర్సును ప్రారంభిస్తున్నామని స్మార్ట్ శిక్షణ కేంద్రం మేనేజర్ షేక్ మౌలా అన్నారు. ఈ మేరకు శనివారం పద్మారావునగర్, పార్సీగుట్ట బస్తీలలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఉచితంగా అందిస్తున్న నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పేద, మధ్య తరగతికి చెంది పదో తరగతి పాసై, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన 19 నుంచి 27 ఏండ్ల వయస్సు ఉన్న నిరుద్యోగులకు మూడు నెలల పాటు ట్యాలీ, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, టైపింగ్, ఇంటర్నెట్, రిటైల్ రంగాలలో ఉచిత శిక్షణ అందించి, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. త్వరలో ప్రారంభమయ్యే నూతన బ్యాచ్‌లలో చేరడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు సెల్ నెంబర్ 9154990135, 8498089786లో సంప్రదించాలని ఆయన కోరారు. గాంధీ దవాఖాన ఎదురుగా యాక్సిస్ బ్యాంక్ సమీపంలో ఎవర్‌గ్రీన్ కమ్యూనిటీ హాలులో తమ శిక్షణ కేంద్రానికి నేరుగా వచ్చి కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో అప్సా సిబ్బంది హరిప్రకాశ్, జయశ్రీ, విజయ్ ప్రతాప్, మహిత పాల్గొన్నారు.

పద్మారావునగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న అప్సా, టెక్ మహీంద్రా స్మార్ట్ సిబ్బంది

మల్లయ్య బట్టుకు శుభాకాంక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 23: తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఈఐడీసీ) ఎండీగా నియమితులైన మల్లయ్య బట్టును తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదవరి సాయితేజ ఆధ్వర్యంలో విద్యార్థులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రాజేశ్, శ్రీకాంత్, మహేశ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ఫీజులను వెంటనే తగ్గించాలి

ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 23: ఉస్మానియా యూనివర్సిటీలో ఇటీవల పెంచిన పీహెచ్‌డీ ఫీజులను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ పరిశోధక విద్యార్థులు ఆందోళనకు దిగారు. దీనిపై అధికారులతో మాట్లాడేందుకు విద్యార్థులు రాగా, పరిపాలనా భవనం గేట్లు మూసివేయడంతో అక్కడే బైఠాయించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పరిశోధక విద్యార్థులు మాట్లాడుతూ పీహెచ్‌డీ కోర్సు ఫీజు పెంపు నిర్ణయాన్ని పూర్తిగా వెనక్కి తీసుకునే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని అన్నారు. పెంచిన ఫీజులు రెండో సంవత్సరం కట్టాలని నోటిఫికేషన్ విడుదల చేశారని చెప్పారు. ఈ నోటిఫికేషన్‌తో పాటు ఫీజుల పెంపు మొత్తాన్ని ఎత్తివేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజులు తగ్గించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో ఈ నెల 26న విద్యార్థి సంఘాలతో కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

టీబీ నిర్మూలనకు కృషి చేస్తున్నాం

ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ రవీందర్ నాయక్, డాక్టర్ రమేశ్‌రెడ్డి, డాక్టర్ అనురాధ

బన్సీలాల్‌పేట్, మార్చి 23 : తెలంగాణలో టీబీ వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు కృషి చేస్తున్నామని, అందరి సహకారంతోనే ఇది సాధ్యమవుతుందని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్ అన్నారు. 'ప్రపంచ టీబీ దినం' సందర్భంగా గాంధీ మెడికల్ కాలేజీలోని ఆలుమ్ని హాలులో శనివారం టీబీ దినోత్సవాన్ని నిర్వహించారు. నేషనల్ హెల్త్ మిషన్, సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, అదనపు డీఎంఈ డాక్టర్ రమేశ్‌రెడ్డి, తెలంగాణ టీబీ అసోసియేషన్ వైస్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎన్‌హెచ్ఎం తెలంగాణ (టీబీ) జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీందర్ నాయక్ మాట్లాడుతూ జ్వరం, దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, అలసట, శ్వాస ఇబ్బందులు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని, అన్ని ప్రభుత్వ దవాఖానలు, ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా పరీక్షలు, చికిత్స పొందాలని ఆయన ప్రజలకు సూచించారు. టీబీ రహిత తెలంగాణా కోసం వైద్య, ఆరోగ్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు కలసి క్షయ వ్యాధి గురించి ప్రజలను చైతన్యం చేయడానికి, అవగాహన కల్పించడానికి నిరంతరం కృషి అభినందనీయమని అన్నారు. అనంతరం తెలంగాణాలోని వివిధ జిల్లాలలో పనిచేస్తున్న ఉత్తమ ప్రతిభ కనబరచిన అధికారులు, ఉద్యోగులకు, పలు స్వచ్ఛంద సంస్థలు, గాంధీ, ఉస్మానియా, ఆర్‌టీసీ నర్సింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో గాంధీ దవాఖాన పల్మనాలజీ హెచ్ఓడీ డాక్టర్ కృష్ణమూర్తి, రాష్ట్ర టీబీ విభాగం అధికారులు డాక్టర్ వాసుప్రసాద్, డాక్టర్ జితేంద్ర, డాక్టర్ ఆదిత్య, సివిల్ సర్జన్ డాక్టర్ సుమలత పాల్గొన్నారు.

నిర్మాణాలు కూల్చివేత

బేగంపేట్ మార్చి 23: బేగంపేట్ మాతా జీనగర్‌లో ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ ప్రభుత్వ స్థలంలో అనుమతి లేకుండా నిర్మించిన సుమారు 50 కట్టడాలను జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం కూల్చివేశారు. జేసీబీలు, ప్రోక్లెన్‌లతో ఈ కూల్చివేతలను చేపట్టినట్టు టౌన్ ప్లానింగ్ ఏసీపీ క్రిష్టఫర్ తెలిపారు. ఈ ప్రాంతంలో ఎప్పటి కూడా నిర్మాణాలు చేపట్టవద్దని ఒక వేళ నిర్మిస్తే తిరిగి మళ్లీ కూల్చివేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బేగంపేట్ మాతాజీనగర్ లోని సర్వేనెంబర్ 194/8/1 పది ఎకరాల 20 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. 2015లో ఓ బడా సంస్థ ఇక్కడ అక్రమ లే అవుట్ వేసి ప్లాట్స్ విక్రయించారు. ఈ విషయాన్ని గుర్తించిన అక్కడి కొంత మంది స్థానికులు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ స్థలంలో వేసిన రోడ్లను చిన్నపాటి నిర్మాణాలను పూర్తిగా కూల్చివేసి ధ్వంసం చేశారు.